## క్లుప్తంగా

### ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

**తవణంపల్లె:** మండలంలోని మడవనేరులో ఉండే వాగు పొరంబోకు స్థలంలో ఆక్రమణలు తొలగించినట్లు తహసీల్దార్ అరుణకుమారి తెలిపారు. మడవనేరుకు చెందిన ఓ రైతు సర్వే నంబర్ 153–1బిలో ఉన్న ఆక్రమణలను తొలగించి ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండలంలో వాగులు, వంకలు ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో భూ రీసర్వే డీటీ వెంకటరమణ, సర్వేయర్ బాబు, వీఆర్ఓ రాజేశ్వరి పాల్గొన్నారు.

### నేడు మామిడి రైతులకు అవగాహన

**ఐరాల:** మండలంలోని మామిడి రైతులకు కోతల అనంతరం చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్లు మండల ఉద్యాన శాఖాధికారి సాగరిక తెలిపారు. ఉదయం 10 గంటలకు దివిటీవారిపల్లెలో జిల్లా ఉద్యాన శాఖాధికారి మధుసూదన్‌రెడ్డి, శాస్త్రవేత్తలచే రైతులకు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

### మొగిలీశ్వరాలయంలో ఘనంగా రాహుకేతు పూజలు



శివాలయంలో రాహుకేతు పూజలు చేస్తున్న భక్తులు

**బంగారుపాళెం:** మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనంగా నిర్వహించారు. స్వయంభు శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి మూలవర్లకు ఉదయం అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం ఆలయం ఆవరణలో రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేపట్టారు. ప్రత్యేక పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దోషనివారణ చేసుకున్నారు. అనంతరం మొగిలీశ్వరస్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

### పాఠశాలకు కంప్యూటర్ వితరణ



పాఠశాలకు దాత అందజేసిన కంప్యూటర్, ప్రింటర్లు

**చిత్తూరు రూరల్ :** సర్కారు బడికి తమ వంతు సహాయం చేయడం గొప్ప విషయమని ఎంఈఓ సెల్వరాజ్ అన్నారు. మండలంలోని బంగారెడ్డిపల్లి జెడ్పీ హైస్కూల్లో సోమవారం కంప్యూటర్ వితరణగా అందజేశారు. ఎంఈఓ మాట్లాడుతూ పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వహించి విరమణ పొందిన శంకర్‌నాయుడు బడికి ఉచితంగా కంప్యూటర్ అందజేశారన్నారు. ఆయన రూ.60 వేలు విలువ చేసే కంప్యూటర్, ప్రింటర్ ఉచితంగా ఇవ్వడం వల్ల పేద విద్యార్థుల చదువుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం శంకర్‌నాయుడును దుశ్శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 మోహన్, హెచ్ఎం అంజనీదేవి పాల్గొన్నారు.

### ప్రతి గ్రామంలో వైద్యసేవలు



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ అనూష

**గుడిపాల:** ప్రతి గ్రామంలోనూ వైద్యసేవలు అందిస్తున్నట్లు ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ అనూష అన్నారు. కొత్తకోట గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ వైద్యసేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. హెల్త్ క్లినిక్‌ల ద్వారా మంచం పట్టిన రోగుల ఇంటి వద్దకే వెళ్లి వైద్యం అందిస్తున్నామన్నారు. గర్భిణులు, షుగర్ పేషెంట్లకు వైద్య చికిత్సలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. 65 మంది రోగులకు చికిత్సలు నిర్వహించారు. వైద్యసిబ్బంది దివ్య, సుమతి, గీత పాల్గొన్నారు.

### అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా

**సదుం:** నాయన పాకాల పోతంవారిపల్లె నుంచి టమాటా బాక్సులతో ట్రాక్టరు సోమవారం కలికిరి మార్కెట్‌కు బయల్దేరింది. పాత పోలీస్ స్టేషన్ వద్ద అదుపుతప్పి ట్రాక్టరు ట్రాలీ బోల్తా పడింది. రాత్రి కావడంతో దుకాణాల వద్ద పెద్దగా జన సంచారం లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.

# పచ్చగడ్డి.. పాల దిగుబడి



రైతులకు ఆపదలో ఆదుకునే జీవనోపాధి పశుపోషణే. వ్యవసాయానికి అనుబంధమైన ఈ పాడిపరిశ్రమ ఇప్పుడు ప్రధాన వృత్తిగా మారింది. గ్రామాల్లో పశుపోషణే ఆధారంగా వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. అయితే నాణ్యమైన పాల దిగుబడి కోసం, పశువుల పెంపకంలో కొన్ని మెలకువలు పాటించాలి. పశువులకు పోషకాహారం అందించినప్పుడు పాల ఉత్పత్తిలో వృద్ధి సాధించవచ్చు. పశువుల ఆరోగ్యానికి, నాణ్యమైన పాల ఉత్పత్తికి పచ్చగడ్డి ఎంతో ఉపయోగపడుతుంది. తద్వారా రైతు ఆదాయం గణనీయంగా పెరుగుతుంది. ఈ సమగ్ర పశుపోషణ విధానాన్ని తెలుసుకుందాం.



- సమగ్ర పశుపోషణపై అవగాహన అవసరం
- పచ్చగడ్డి పశువులకు మంచి పోషకాహారం
- పాడి రైతులకు అధిక ఆదాయం

**బంగారుపాళెం:** పశువుల పోషణ రైతులకు పెనుభారమైన నేపథ్యంలో సమగ్ర పశుపోషణ పద్ధతులను రైతులు అలవర్చుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులు సూచిస్తున్నారు. సమగ్ర పశుపోషణతోనే పశువు ఆరోగ్యకరమైన జీవనం సాగించగలదు. ప్రధానంగా పచ్చి మేతల వల్ల పశువుల్లో పాలదిగుబడి పెరుగుతుందని చెబుతున్నారు. ప్రధానంగా వేసవి తరువాత వచ్చే వర్షాకాలం ప్రారంభంలో పశువుల మేతకు కొరత లేకుండా చూసుకోవాలి. పచ్చి మేతలతో పశువులకు పోషక విలువలు అందుతాయి. తద్వారా నాణ్యమైన పాల దిగుబడి వస్తుంది.

**పచ్చిమేత వల్ల ప్రయోజనాలు**

ఎండు మేత పశువులకు కడుపునింపడానికి మాత్రమే ఉపయోగపడుతుంది. పచ్చిమేత కొరత రాకుండా చేసుకోవడానికి రైతు తన పొలంలో పదోవంతు భూమిలో పచ్చగడ్డిని పెంచుకోవాలి. పచ్చి మేతల్లో అధిక పోషకాలు, విటమిన్లు ఎక్కువగా ఉండటం వలన పశువులు ఎదకు త్వరగా వస్తాయి. అంతేకాదు పాల ఉత్పత్తి అధికంగా పెరగడానికి ఈ పచ్చగడ్డి ఎంతగానో ఉపయోగపడుతుంది. పచ్చి మేతలో కాయజాతివి ఒకరకం, కాయజాతి కానివి మరో రకం ఉంటాయి. కాయ జాతిలో చిరుధాన్యాలు, గడ్డి రకాలు ఉంటాయి. కాయ జాతి కాని రకాల్లో పశువులకు కావాల్సిన శక్తినివ్వడానికి, కాయ జాతి రకాలు మాంసకృత్తుల వృద్ధికి పనికి వస్తాయి. మేలు జాతి గడ్డి రకాలను ఎంచుకుని రైతులు పెంచుకోవాలి. పచ్చిగడ్డిలో 70 శాతం, ఎండుగడ్డిలో 30 శాతం పోషక విలువలు ఉంటాయి.

**గడ్డి జాతుల్లో రకాలు**

**ధ్యాన్యపు జాతి రకాలు:** వీటిలో హైబ్రీడ్ జొన్న, మొక్కజొన్న ప్రధానం. హైబ్రీడ్ జొన్నలో పీసీ పూచాచారి, 23, ఎంపీ చారి, ఎస్ఎస్‌జీ 53, ఎస్ఎఫ్‌జీ 59 అనే మూడు రకాలు ఎంపిక చేసుకోవాలి. మొదటి దశ కోత 60 రోజులకు వస్తుంది. ఎకరాకు 30 నుంచి 35 టన్నుల దిగుబడి వస్తుంది. మూడు కోతలు, ప్రతి 40 రోజులకోసారి కోతకు వస్తుంది.

- మొక్కజొన్నలో ఆఫ్రికన్‌టాల్ లేదా గంగ, హైబ్రీడ్ ఎఫ్, విజయ్ కిసాన్ రకాలు ఉన్నాయి. మొదటి కోత 60 నుంచి 70 రోజులకు వస్తుంది. 20 నుంచి 23 టన్నుల దిగుబడి లభిస్తుంది. మూడు కోతలు వస్తుంది.

**కాయజాతి పచ్చిమేతలు**

అలసందలో యూపీసీ 5236, ఈసీ 4216 రకం, ఐసీ 4216 రకం, రష్యన్ అలసంద రకాలు మంచి విగా ఉన్నాయి. ఈ రకం 70 రోజులకు కోతకు వస్తుంది. పచ్చిమేత 8 నుంచి 10 టన్నుల దిగుబడి వస్తుంది. ఒక కోత మాత్రమే వస్తుంది.

- లూసర్న్ రకంలో ఆనంద్ 2, ఆర్ఎల్ 52, కామ్ 2, ఆర్ఎల్ 58 రకాలు ఉన్నాయి. మొదటి కోత 60 రోజులకు వస్తుంది. ఎకరాకు 20 నుంచి 25 టన్నుల పచ్చిమేత లభిస్తుంది. ప్రతి 30 రోజులకు ఒకసారి 8 కోతల వరకు వస్తుంది.
- పిల్లిపెసరలో మొదటి కోత 50 రోజులకు వస్తుంది. 8 నుంచి 10 టన్నుల దిగుబడి వస్తుంది.
- జనుములో మొదటి కోత 50 రోజులకు వస్తుంది. 50 శాతం పూత దశలో కోయాలి. ఒకే కోత ఉంటుంది. 7 నుంచి 9 టన్నుల దిగుబడి లభిస్తుంది.



గొల్లపల్లె వద్ద సాగులో ఉన్న నేపియర్ జాతి గడ్డి

**గడ్డిజాతుల్లో మేలు రకాలు**

**నేపియర్:** నేపియర్ బజ్రా21, ఏపీబీఎన్1, కో1, కో2, కో4 వంటివి ఎంపిక చేసుకోవాలి. మొదటి కోత కణుపులు నాటిన తరువాత 60 నుంచి 75 రోజుల కాలవ్యవధిలో లేదా ప్రతి 40 రోజులకోసారి సంవత్సరానికి 5 నుంచి 6 కోతలు కోయవచ్చు. 70 నుంచి 80 టన్నుల దిగుబడి లభిస్తుంది.

**సారా గడ్డి జాతి :** నాటిన 75 నుంచి 80 రోజులకు కోతకు వస్తుంది. సుమారు 30 నుంచి 35 టన్నుల దిగుబడి లభిస్తుంది. ఎకరాకు ప్రతి 40 రోజులకోసారి కోతకు వస్తుంది. ఇలా 6 కోతల వరకు కోయవచ్చును.

**గిన్ని గడ్డి రకం:** పీపీజీ14, హమిల్, మాకుని, కలోనియన్ జాతులు మంచివి. ఈ రకాలు నాటిన 60 నుంచి 70 రోజుల వ్యవధిలో మొదటి కోతకు వస్తుంది. ఏడాదికి 7 కోతలు వస్తాయి. 30 నుంచి 35 టన్నుల దిగుబడి లభిస్తుంది.

**మేలు జాతి గడ్డి రకాలను పెంచాలి**



రైతులు మేలు జాతి గడ్డి రకాలను పెంచుకోవాలి. తమకున్న పొలంలో పదో వంతు గడ్డి సాగు చేయడం వలన పశు గ్రాసం కొరత ఉండదు. మేలు జాతి గడ్డి తినడం వలన పశువులు అధిక పాలను ఇవ్వడం ద్వారా రైతులకు లాభాలు బాగుంటాయి.

– డాక్టర్ షేక్‌ఆసీఫ్ ఏడి, బంగారుపాళెం

## డయేరియాను అరికడదాం

**ఐరాల:** సమష్టిగా పనిచేసి డయేరియాను అరికడదామని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ కో–ఆర్డినేటర్లు రఘునందరెడ్డి, మురళీకృష్ణ సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులు డయేరియా బారిన పడి చనిపోకూడదన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా నెల రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు కాచి చల్లార్చిన నీరు, క్లోరినేషన్ చేసిన నీటిని తాగాలన్నారు. బయటి ఆహార పదార్థాలు తినకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు భోజనం ముందు, తర్వాత బాత్ రూము ఉపయోగించిన అనంతరం చేతులు ఎలా శుభ్రం చేసుకోవాలో అవగాహన కల్పించారు.




అవగాహన కల్పిస్తున్న జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ కో–ఆర్డినేటర్లు

అనంతరం విద్యార్థులతో కలిసి పురవీధుల్లో స్టాప్ డయేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓలు రుషేంద్రబాబు, దామోదర్‌నాయుడు పాల్గొన్నారు.

## ప్రకృతి సేద్యంపై దృష్టి

**పాలసముద్రం:** ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని నగరి డివిజన్ ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్ పుష్ప తెలిపారు. సోమవారం ఐకేపీ కార్యాలయంలో క్రిష్ణజమ్మపురం యూనిట్‌లోని గ్రామ సంఘం అధ్యక్షులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పుష్ప మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో చెరకు సాగు చేస్తే అందులో వస్తున్న బెల్లం తీసుకోవడానికి టీటీడీ సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో ద్రవ, ఘన జీవామృతం, కషాయాలతో పంటలు పండించే విధానంపై అవగాహన కల్పించారు. సంఘ సభ్యులు కిచెన్ గార్డెన్‌పై వివరించారు. వరిపంటను ఆశించే చిన్నచిన్న తెగుళ్ల నివారణకు పేడ, ఇంగువతో చేసిన ద్రావణం వినియోగించాలని, దానిని ఏవిధంగా తయారు చేయాలో తెలుసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోండి

**చిత్తూరు అర్బన్:** దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తెలంగాణ ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఏపీ నిరుద్యోగుల దివ్యాంగుల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. చిత్తూరులో సోమవారం ఎస్పీ మణికంఠను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడుతూ స్మితా సబర్వాల్ తన ఎక్స్ ఖాతాలో సివిల్ సర్వీసెస్‌లో దివ్యాంగులకు రిజర్వేషన్ ఎలా కల్పిస్తారంటూ ఆమె ప్రశ్నించడం సభ్య సమాజం తల దించుకునేలా ఉందన్నారు. వెంటనే ఆమె తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని, దివ్యాంగులకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని కోరారు. లేకుంటే దివ్యాంగుల చట్టం 2016 ప్రకారం ఆమెపై చర్యలు తీసుకుని, ఐఏఎస్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు సుమతి, కవిత, శరత్, చిరంజీవి, గిరి పాల్గొన్నారు.



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న దివ్యాంగ జేఏసీ నేతలు

## అలరించిన విద్యార్థుల గణిత ప్రజ్ఞాధారణ

**గంగాధరనెల్లూరు:** వేపంజేరి హైస్కూల్లో సోమవారం నిర్వహించిన విద్యార్థులు గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమం పలువురిని అలరించింది. ఆంధ్రప్రదేశ్ మాథ్స్ ఫోరంలో భాగంగా రమారమి దినోత్సవం సందర్భంగా వేపంజేరి హైస్కూల్లో గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులలో గణితంపై ఆసక్తిని పెంచడానికి ఈ కార్యక్రమం చేపట్టారు. సంధానకర్తగా గణిత అవధాన గురువు హెచ్.అరుణ శివప్రసాద్ వ్యవహరించారు. విద్యార్థులు గణితంలో చేసే గారడీలు అసాధారణమని, ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహించాలని పలువురు కోరారు. పాప్పు దేసి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు జయంతి స్పందించి హేమ, లహరి, పునీత్‌సాయి మంగళపల్లి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభను కొనియాడుతూ వారికి ప్రోత్సాహకాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు ఆంజినేయులుశెట్టి, గుణశేఖర్ రెడ్డి, వేపంజేరి హైస్కూల్ హెచ్ఎం మురళీకృష్ణ, గణిత ఫోరం జిల్లా అధ్యక్షుడు చంద్రమనాయుడు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర టెక్నికల్ కమిటీ సభ్యురాలు స్వప్న జిల్లా కోశాధికారి మనోహర్, ఉత్తమ టీచర్ మునిరెడ్డి, హైస్కూల్ గణిత ఉపాధ్యాయులు శేషగిరిరావు, జవహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులతో సన్మానం

## ప్రతి ఫిర్యాదుపై విచారణ చేపట్టండి





కార్యాలయంలో సమస్యలు వింటున్న కమిషనర్ అరుణ, గంగినేని చెరువు పిల్లల పార్కులో తినుబండారాల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న కమిషనర్

**చిత్తూరు అర్బన్:** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి ఫిర్యాదుపై అధికారులు విచారణ చేపట్టాలని చిత్తూరు మునిసిపల్ కమిషనర్ అరుణ ఆదేశించారు. సోమవారం చిత్తూరు కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. ఇందులో ఇంజినీరింగ్, ప్రజారోగ్యం, మెప్మా, రెవెన్యూ విభాగాలకు సంబంధించి పది ఫిర్యాదులు వచ్చాయి. సకాలంలో వీటిని విచారించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

**పిల్లల పార్కు తనిఖీ**

చిత్తూరు నగరంలోని గంగినేనిచెరువు పిల్లల పార్కును మునిసిపల్ కమిషనర్ అరుణ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పార్కు ఆవరణలో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను పరిశీలించారు. అక్కడ తినుబండారాలపై మూతలు, శుభ్రత లేకపోవడంతో నిర్వాహకుడికి రూ.5 వేల జరిమానా విధించారు. ఇక్కడున్న ఓపెన్ జిమ్ పరికరాలు కొన్నింటికి మరమ్మతులు చేయించి, వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ వెంట ప్రజారోగ్యశాఖ అధికారి డా.అనిల్‌కుమార్ నాయక్, మేనేజరు వర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అమర్‌నాథ్ తదితరులు ఉన్నారు.

## పంట మార్పిడితో అధిక దిగుబడులు

**పాలసముద్రం:** వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేయడంతోపాటు పంట మార్పిడి చేయడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని ఏఓ ఢిల్లీప్రసాద్ తెలిపారు. సోమవారం పాలసముద్రంలో వేరుశనగ తదితర పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు తరచూ ఒకే పంటను సాగు చేయకుండా పంట మార్పిడి తప్పనిసరిగా చేయాలన్నారు. పంట సాగు చేసే సమయంలో భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. వచ్చిన ఫలితాల ఆధారంగా ఎరువు వాడాలని సూచించారు. కత్తెర పురుగును తగు జాగ్రత్తలతో నివారించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పలు పంటలను ఆశించే పురుగులు తెగుళ్ల గురించి, వాటి నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## పశుపెంపకంలో జాగ్రత్తలు

**పాలసముద్రం:** పాడి పశువుల పెంపకంలో రైతులు సరైన జాగ్రత్తలు పాటించాలని పశువైద్యాధికారి యశస్వి తెలిపారు. సోమవారం శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయ పరిధిలో ఉచిత పశు వైద్య పరీక్షలు నిర్వహించారు. పాడి రైతులకు పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధులు, వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. పశువులకు వ్యాధులు వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే గ్రామాల్లో ఉంటే వెటర్నరీ అసిస్టెంట్లకు తెలియజేయాలన్నారు. పశువులకు వ్యాధి నిరోధక టీకాలను విధిగా చేయించాలన్నారు. అనంతరం పాడి పశువులకు ఉచితంగా టీకాలు, పిడుదుల మందు పిచికారీ చేశారు. కార్యక్రమంలో పాడి రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

**చిత్తూరు అర్బన్:** చిత్తూరు నగరంలోని 39వ డివిజన్‌లో ఉన్న మునిసిపల్ పాఠశాల విద్యార్థులకు మేయర్ అముద విద్యా సామగ్రి కిట్లను అందచేశారు. పెద్ద హరిజనవాడలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని పిల్లలకు కిట్లను పంపిణీ చేశారు. విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధనం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు రాణి, ఎల్‌బివి లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న మేయర్ అముద

## వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

**బంగారుపాళెం:** విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి ఫీరూసాహెబ్ అన్నారు. స్థానిక పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా నివారణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత చాలా అవసరమన్నారు. విద్యార్థులు ఆరోగ్య సూత్రాలను పాటించాలన్నారు. ముఖ్యంగా ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని సూచించారు. బయట లభించే పదార్థాలను తినడం వల్ల అనారోగ్యం బారిన పడతారని తెలిపారు. సీజనల్ జబ్బులపై జాగ్రత్తగా ఉండాలన్నారు. దోమ కాటుకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ వందనా త్రిపాఠి మాట్లాడుతూ, ఆరోగ్యకర సమాజంలో యువత పాత్ర చాలా ముఖ్యమన్నారు. చెడు అలవాట్లను దూరం చేసుకుని మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామంతో ఆరోగ్యంగా ఉండాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ రమేష్‌బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ మురళి, హెల్త్ సూపర్ వైజర్ హరికృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బంగారుపాళెం: సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫీరూసాహెబ్

**ఆరోగ్య సూత్రాలు పాటించాలి**

**ఐరాల:** వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ సూచించారు. మండలంలోని వేదగిరివారిపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 60 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మందులు అందజేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. వైద్యాధికారి మాట్లాడుతూ కుష్టువ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నయం చేయవచ్చని తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలో కుష్టువ్యాధిపై ఆగస్టు 2వ తేదీ వరకు సర్వే ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



ఐరాల: పరీక్షిస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్